నరసాపురం ప్రభుత్వాస్పత్రిలో సకల సౌకర్యాలు

- కొత్త ఏరియా ఆసుపత్రి భవనంలోకి అన్ని విభాగాలు మార్పు
- ఆపరేషన థియేటర్లు ప్రారంభించిన ముదునూరి


ఆపరేషన్ థియేటర్‌లో సౌకర్యాలపై వైద్యులతో మాట్లాడుతున్న చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు


చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజును సత్కరిస్తున్న ముత్యాలమ్మ ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులు

నరసాపురం: గైనిక్ విభాగాలకు మాత్రమే సంబంధించి కాకుండా ఆర్థోపెడిక్, కణతులు తదితర ఆపరేషన్‌లతో సహా మొత్తం అన్ని రకాల వైద్య సదుపాయాలు ఇకపై నరసాపురం ఏరియా ప్రభుత్వాసుపత్రిలోనే సాగుతాయని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు చెప్పారు. 50 పడకల ప్రభుత్వాపత్రిని రూ.13 కోట్లుతో ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేసిన తరువాత గైనిక్, ఆర్థోపెడిక్ తదితర విభాగాలను కొత్త భవనంలోకి మార్చారు. ఈ సందర్భంగా మంగళవారం ఆసుపత్రి అభివృద్ధి సలహా కమిటి సమావేశాన్ని ముదునూరి ఆసుపత్రి భవనంలో నిర్వహించారు. కొత్త ఆసుపత్రిలో ఇంకా కావాల్సిన సదుపాయాలు, ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కొత్త ఆసుపత్రి భవనంలో వార్డులను పరిశీలించారు. గైనకాలజీ విభాగానికి సంబంధించి రెండు ఆపరేషన్ థియేటర్‌లను ప్రారంభించారు.

దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేనట్లే..

గతంలో రోడ్డు ప్రమాదాల్లో కాళ్లు చేతులు విరిగినా, కడుపులో కణతులు ఉన్నా కాకినాడ, రాజమండ్రి ప్రభుత్వాసుపత్రులకు పంపించేవారని ముదునూరి ప్రసాదరాజు చెప్పారు. ఇకపై అలాంటి అవసరం ఉండదని స్థానికంగా ఏరియా ఆసుపత్రిలోనే అన్ని వైద్య సదుపాయాలు అందుబాటులోకి తెచ్చామన్నారు. 18 వైద్యులు పోస్టులు కూడా భర్తీ చేశామని వివరించారు. నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రి విషయంలో ఇదో చరిత్ర అన్నారు. గుండెనొప్పి వచ్చి ఆసుపత్రికి వచ్చినా ప్రాథమిక వైద్యంలో భాగంగా ఇచ్చే రూ.20 వేలు ఖరీదు చేసే త్రోంబోసిస్ ఇంజక్షన్‌లు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు పూర్తి స్థాయిలో సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడ వైద్యం సాధ్యం కాని క్రిటికల్ కేసులు మాత్రమే వేరే ఆసుపత్రులకు రిఫర్ చేయాలన్నారు. అదీ ఆరోగ్యశ్రీ అందుబాటులో ఉన్న ఆసుపత్రులకు మాత్రమే పంపించాలని ఆదేశించారు. ఇక్కడ నుంచి బయటకు రిఫర్ చేసిన రోగుల పరిస్థితి, వారిని వేరే ఆసుపత్రుల్లో చేర్చుకున్నారా?లేదా? అనే అంశాలు వైద్యులు ఆరా తీయాలన్నారు. ఆరోగ్యమిత్రలు అలెర్ట్‌గా ఉండాలని చెప్పారు. ప్రభుత్వం దాదాపుగా అన్ని రకాల వ్యాధులను ఆరోగ్యశ్రీలో చేర్చిందని ఈ అంశంపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ఆర్ సుప్రియ, ఆసుపత్రి అభివృద్ధి కమిటి డైరెక్టర్ గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, కౌన్సిలర్ జిల్లెళ్ల దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

మొగల్తూరు: బండి ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి మీ వంతుగా కృషి చేయాలని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సూచించారు. సోమవారం ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ అమ్మవారి ధర్మకర్తల మండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన సభ్యులు మంగళవారం నరసాపురంలోని చీఫ్‌విప్ నివాసంలో ప్రసాదరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించిచారు. ఆలయ అభివృద్ధికి అవసరమయ్యే నిధుల మంజూరుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రసాదరాజును కలిసిన వారిలో చైర్మన్ కడలి మాణిక్యాలరావు, ధర్మకర్తల మండలి సభ్యులు ఇలపకుర్తి రమేష్‌బాబు, బొల్లం శ్రీనివాసరావు, బాలం విజయ, బొక్కా శ్రీలక్ష్మి, దాసరి లక్ష్మి తదితరలు ఉన్నారు.

చట్టం దృష్టిలో అందరూ సమానమే

నరసాపురం: చట్టం దృష్టిలో అందరూ సమానమేనని నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కామన బుజ్జి వివరించారు. మంగళవారం సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా సరిపల్లి గ్రామ సచివాలయం వద్ద మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. చట్టపరంగా ఎలాంటి వివక్షత, తారతమ్యం లేకుండా ప్రజలందరికీ సమ న్యాయం అందే విధంగా, ప్రజల్లో చట్టాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో సామాజిక న్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తుంటారని చెప్పారు. పౌరులు ఏ రూపంలో వివక్షతకు గురైనా కూడా న్యాయసేవాధికార సంస్థను ఆశ్రయించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉచిత న్యాయవాదులు కేసీహెచ్ పద్మ, నక్కా ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా కమిటీలో కృపానాథ్‌కి చోటు


పాలపర్తి కృపానాథ్

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా సంయుక్త కార్యదర్శిగా పాలపర్తి కృపానాథ్‌ను నియమించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) సూచనల మేరకు ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొల్లాబత్తుల రవికుమార్ కృపానాథ్‌ను జిల్లా కమిటీలో నియమించారు. ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం చేసినట్లు గుడాల గోపి మంగళవారం విలేకరులకు తెలిపారు. ఇప్పటికే ఎస్సీ సెల్ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శిగా రావి నాగేశ్వరరావు, కార్యదర్శులుగా సాక కమలాకర్, రామాంజుల పెదమధు, సంయుక్త కార్యదర్శులుగా నెల్లి ఆనందరావు, వడ్లపాటి సురేష్‌లను నియమించినట్లు గోపి తెలిపారు.

నృసింహునికి విశేష పూజలు

అత్తిలి: భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా అత్తిలి గ్రామంలో బాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వేంచేసియున్న శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి వారికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి ఉదయం అభిషేక పూజలు జరిపి, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి సత్యనారాయణాచార్యులు, వల్లీ వెంకటేష్ ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు.

పాలకొల్లు పట్టణాన్ని కమ్మేసిన మంచు


పట్టణంలో దట్టంగా కురుస్తున్న మంచు

పాలకొల్లు సెంట్రల్: పట్టణాన్ని కమ్మేసిన మంచు. మంగళవారం ఉదయం 8 గంటల వరకూ మంచు కురుస్తూనే ఉండడంతో ఉదయం పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. ఎదురుగా వచ్చే వాహనాలు, మనుషులు దగ్గరకు వచ్చే వరకూ కనిపించలేదు. మంచు వర్షం కురిసినట్లు కురవడంతో పిల్లలను బయటకు పంపడానికి తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే 'ఆడుదాం ఆంధ్ర'


పోడూరు క్రీడాకారులకు ట్రోఫీ అందిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: రాష్ట్రంలో క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని అందించడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్రాను ప్రతిష్టాత్మకంగా నిర్వహించారని మాజీమ ంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆడుదాం ఆంధ్రాలో నియోజకవర్గంలో ప్రథమ స్థానాన్ని, జిల్లాలో తృతీయ స్థానాన్ని పొందిన పోడూరు క్రికెట్‌జట్టును అభినందించి ట్రోఫీని, షీల్డులు, పతకాలను తూర్పుపాలెంలో మంగళవారం అందించారు. కార్యక్రమంలో పోడూరు సొసైటీ అధ్యక్షుడు రుద్రరాజు శివాజీ రాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ చేకూరి సూరిబాబు, ఎస్సీ సెల్ కన్వీనరు పోతుమూడి రామచంద్రరావు, ఏఎంసీ డైరెక్టరు గంటా గిరిబాబు, బీసీ కులాల జేఏసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు చింతపల్లి గురుప్రసాద్‌లు పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలి

కొడమంచిలి దేవస్థానం పాలకమండలి ఆలయాభివృద్ధికి కృషి చేయాలని మాజీమంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును కలిసి నూతన పాలక మండలి కృతజ్ఞతలు తెలిపారు. అధ్యక్షుడిగా శేనం రామకృష్ణ(కాపు), ట్రస్టీలుగా కొల్లేపర వెంకన్నబాబు(వైశ్య), నార్గన ఆదినారాయణ(గౌడ), మన్నే లక్ష్మి(కమ్మ), పితాని సత్యవతి(శెట్టిబలిజ), మావూరి కుసుమ (పద్మశాలి), కొండేటి వెంకాయమ్మ(మాదిగ)లను నియమించారు. కార్యక్రమంలో ఆచంట మండల సర్పంచ్ చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, వనమరాజు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను వినియోగించుకోవాలి


జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగిని పరిక్షిస్తున్న డాక్టర్ దినేష్

మొగల్తూరు: గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ దినేష్ సూచించారు. మంగళవారం మండలంలోని మోడి గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన రోగులను పరిక్షించారు. ఈ శిబిరంలో డాక్టర్ ఒ.దినేష్, జనరల్ వైద్యులు) డాక్టర్ జేఈఎస్ గణేష్ బాబు(చిన్న పిల్లల వైద్యులు), డాక్టర్ విజయశాంతి (జనరల్ వైద్యురాలు), డాక్టర్ టి.వాసు (కంటి వైద్య నిపుణులు) రోగులను పరీక్షించారు. ఈ శిబిరానికి సుమారు 386 మంది రోగులు హాజరుకాగా వారికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వీరిలో 94 మందికి కళ్ల జోళ్లు అవసరమని, ఇద్దరికి ఆపరేషన్‌లు అవసరమని గుర్తించినట్లు డాక్టర్ సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మారెళ్ల మాధవి, ఎంపీటీసీ సభ్యురాలు తిరుమాని వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు కడలి వాసు, దాసరి శివాజీ, బండి ముత్యాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కడలి మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పథకాలు ప్రజలకు శ్రీరామరక్ష


22వ వార్డులో మహిళలకు బ్రోచర్‌ను అందిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన నవరత్నాల పథకాలు ప్రజలకు శ్రీరామరక్షగా నిలిచాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు చెప్పారు. పాలకొల్లు పట్టణంలోని 22వ వార్డులో మంగళవారం జగనన్న కోసం జనం..గోపన్న కోసం మనం కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్‌కి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా వలంటీర్ ద్వారా ప్రతీ నెలా 1వ తేదీ ఉదయమే పింఛన్ డబ్బులు ఇంటికి పంపిస్తున్న జగన్‌కే మా ఓటని పలువురు వృద్ధులు గుడాల గోపి ముందు ప్రకటించడంతో ఆయన సంతోషిస్తూ సీఎం జగన్‌ని, తనను ఆశీర్వదించాలని కోరారు.

దిమ్మలు కట్టారు...పనులు చేయలేదు

గత టీడీపీ ప్రభుత్వ కాలంలో ఎమ్మెల్యే నిమ్మల అభివృద్ధి పనుల కోసం శిలాఫలకాలు వేసుకున్నారే తప్ప పనులు చేయలేదని గుడాల గోపి దుయ్యబట్టారు. పాలకొల్లు ప్రజలు పీడిస్తున్న దమ్మయ్యపత్తి డ్రెయిన్, బెజవాడు కోడు డ్రెయిన్ పనులు పూర్తి చేసి దోమల బెడద లేకుండా, అలాగే పారిశుధ్యం, డ్రెయినేజీ సమస్యలు లేకుండా చేస్తానని గుడాల గోపి హామీ ఇచ్చారు. పాలకొల్లు పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతానన్నారు. సీఎం జగన్ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ప్రజలే స్వచ్ఛందంగా సీఎం జగన్‌కి ఓటు వేస్తామని చెప్పడం తమకు ఎంతో సంతోషానిస్తుందన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

అనంతరం కొత్తపేట మునిసిపల్ స్పెషల్ ప్రాథమిక పాఠశాలను గుడాల గోపి సందర్శించారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. మధ్యాహ్నం భోజనం రుచి చూశారు. అన్నం కొద్దిగా పదునుగా వార్చడంతో గోపి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు రుచికరంగా భోజనం తయారు చేసి వడ్డించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, ఏఎంసీ వైస్ చైర్మన్ డీటీడీసీ బాబు, పార్టీ నాయకుడు అడబాల వెంకటరమణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు, మండల గౌరవాధ్యక్షుడు ఎం మైఖేల్‌రాజు, యూత్ అధ్యక్షుడు మానుకొండ శ్రీనుబాబు, వార్డు ఇన్‌చార్జ్ పిల్లా శ్రీనివాస్, వార్డు నాయకులు యాదంరెడ్డి శ్రీనివాసరావు, పిల్లా అప్పాజి, కుసుమే ఝాన్సీ, దేశంశెట్టి రాము, గెద్దాడ దేవి తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది యాత్రికులకు అన్నప్రసాద వితరణ


చించినాడలో అంతర్వేది యాత్రికులకు అన్న ప్రసాదం పంపిణీ చేస్తున్న కాయగూరల వర్తకులు

యలమంచిలి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణం తిలకించడానికి వెళ్తున్న యాత్రికులకు చించినాడ బైపాస్ రోడ్డులో కాయకూరల వర్తకులు మంగళవారం భోజనాలు ఏర్పాటు చేశారు. సుమారు రూ.5 లక్షలు వెచ్చించి ఏడువేల మందికి అన్నసమారాధన చేశారు. అదే ప్రదేశంలో తాళాల భజన కూడా ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వర్తకులు సుంకర నరసింహమూర్తి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బాధిత రైతులకు పరామర్శ


గాయాలపాలైన గేదె ను పరిశీలిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: మండలంలోని చింతపర్రులో అగ్నిప్రమాద రైతు కుటుంబాలను మంగళవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో రూ.లక్ష విలువైన పాడి గేదె మృతి చెందిందిదని, మరో రెండు పాడి గేదెలు కూడా 80 శాతం శరీరం కాలిపోవడంతో వాటి పరిస్థితి కూడా విషమంగా మారిందని రైతులు ఏడుకొండలు, వెంకటేష్ గోపి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. పాడి పశువులకు ఇన్సూరెన్స్ కూడా చేయించలేదన్నారు. బ్యాంక్ నుంచి రుణం తీసుకున్న ఒక పశువుకి మాత్రమే ఇన్సూరెన్స్ ఉందన్నారు. దీంతో గోపి స్పందించి పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వం నుంచి సహాయం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని బాధితులకు గోపి హామీ ఇచ్చారు. తన వంతు సహాయంగా రూ.20 వేలు ప్రకటించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ డీటీడీసీ బాబు, మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు, సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు, ఉప సర్పంచ్ పెన్మెత్స రామకృష్ణంరాజు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఆయన వెంట ఉన్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు పరామర్శ...

అనంతరం శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న చింతపర్రుకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు తాళం రవిని గుడాల గోపి పరామర్శించారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కఠారి జయలక్ష్మి

ఆకివీడు: వివిధ గ్రాంటుల ద్వారా మంజూరు అయిన పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ కఠారి జయలక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మంగళవారం సమావేశం జరిగింది. సమావేశంలో ఆమె మాట్లాడుతూ వివిధ గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం, ఆర్ అండ్ బీ, మండల పరిషత్, జెడ్పీ, ఇతర ప్రభుత్వ నిధులు మంజూరుతో పనులు వేగంగా చేపట్టాలన్నారు. పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, పైప్‌లైన్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు నిధులు మంజూరు అయ్యాయని చెప్పారు. వివిధ శాఖ పనితీరును సమీక్షిస్తూ మండలంలో రబీ సాగు ఆశాజనకంగా ఉందని ఏఓ ప్రియాంక చెప్పారు. రైతులకు అందుబాటులో ఎరువులు ఉన్నాయన్నారు. ఈకేవైసీ జరుగుతుందని రైతులు ఈక్రాప్ నమోదు ప్రక్రియను తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఉపాధి హామీ పనులకు పంచాయతీలు తీర్మానాలు చేసి ఇవ్వాలని ఆ శాఖ అధికారిణి తెలిపారు. ఈ ఏడాది మండలంలో 1,29,646 పనిదినాలు కల్పించినట్లు చెప్పారు. రూ.3.15 లక్షల వేతనాలు, రూ.1.23 కోట్ల మెటీరియల్‌పనులు, మొత్తం కలిపి రూ.4.54 కోట్లు వెచ్చించినట్లు వివరించారు. మండలంలో పలు చోట్ల ఆర్ అండ్ బీ పనులు ప్రారంభించామని ఆ శాఖ అధికారి తెలిపారు. మండలంలో రెండు విడతలుగా రేషన్ బియ్యం సరఫరా జరుగుతుందని ఎమ్మార్వో వెంకటేశ్వరి చెప్పారు. విద్యుత్, మంచినీటి సమస్యలపై చర్చించారు. సమావేశంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఏఓ శ్రీకర్, సర్పంచ్‌లు ఊసల బేబీ స్నేహ, ఎన్.రామరాజు, నందమూరి ప్రకాశం, నాతిరెడ్డి ఆదిలక్ష్మి, ఎంపీటీసీలు , వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

అభిమానం, ఆదరణతోనే సామాజిక న్యాయం

ఆకివీడు: తోటి వారి పట్ల అభిమానం, ఆదరణతోనే సామాజిక న్యాయం లభిస్తుందని, పుచ్చకాయల రాజేశ్వరమ్మ, శేషమ్మ ట్రస్టు చైర్మన్ పుచ్చకాయల బ్రహ్మాజీ చెప్పారు. మండలంలోని పెదకాపవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు.ఎంపీపీ కఠారి జయలక్ష్మి, సర్పంచ్ ఊసల బేబీ స్నేహ, గణపవరం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మలా కుమారి, అధ్యాపకులు వెంకటరమణ, చైతన్య, ప్రధానోపాధ్యాయుడు శ్రీకాళహస్తేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

23 శాతం వేతన పెంపుపై హర్షం

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర సమగ్ర శిక్షలో పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్‌గా, వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు 23 శాతం వేతనాలు పెంచుతూ రాష్ట్ర పథక సంచాలకులు ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్ర ఆర్ట్ క్రాఫ్ట్ పీఈటీ యూనియన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పండా సుబ్బారావు తెలిపారు. మంగళవారం రాష్ట్ర ఆర్ట్ క్రాఫ్ట్ పీఈటీ యూనియన్ తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ గత నెల 10న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణతో జరిగిన చర్చల్లో భాగంగా ఈ వేతనం పెంపుదల జరిగిందన్నారు. తాము ఎంటీఎస్‌ని అమలు చేయాలని కోరామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఎంటీఎస్ చేయలేమని కొంత మేరకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. హామీ ఇచ్చిన ప్రకారం మంగళవారం 23 శాతం వేతనం పెంచుతున్నట్లు జీవో ఇవ్వడం హర్షణీయమని అన్నారు. తమ డిమాండ్లలో మరిన్ని అంశాలను త్వరలో పరిశీలిస్తామని చెప్పారన్నారు.

కలిగొట్ల ఘటనపై కేసు నమోదు

ఉండి: సోమవారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి మండలంలోని కలిగొట్ల గ్రామంలో కిరాణాషాపు యజమాని అయిన యశోధ కృష్ణయ్య అనే వ్యక్తి ఇంట్లో చొరబడిన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వ్యాపారం ముగించుకుని ఇంట్లోకి వెళ్లిన కృష్ణయ్యపై అప్పటికే ఇంట్లో ముసుగు వేసుకుని దాగి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి వెనుకవైపుగా వచ్చి ముసుగు వేయడంతో కంగారు పడిన కృష్ణయ్య కేకలు వేశాడు. దీంతో చుట్టుప్రక్కల వారు అక్కడికి రావడాన్ని గమనించిన గుర్తు తెలియని వ్యక్తి అక్కడ నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై కృష్ణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎం లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

కవిటంలో వైభవంగా యాగపూజలు


కవిటంలో అతిరుద్ర యాగపూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

పోడూరు: అతిరుద్ర యాగ మహోత్సవాల్లో భాగంగా కవిటం గ్రామంలో కొద్దిరోజులుగా యాగపూజలు, హోమాలు, కల్యాణమహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా మంగళవారం వేదపండితులు గణపతి పూజ, రుద్రహోమం, ఈశ్వరునికి అభిషేకం, రుద్రక్రమార్చన, చండీహోమం, అరుణహోమం తదితర పూజా కార్యక్రమాలు జరిపారు. రాత్రి శ్రీరమా సహితశ్రీ వీరవెంకట సత్యనారాయణస్వామి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జంధ్యాల శ్రీనివాసశర్మ, కర్రి శ్రీనివాసరెడ్డి, పడాల వెంకట సత్యనారాయణరెడ్డి, మండ కాశీవిశ్వనాధరెడ్డి, మేడపాటి రామచంద్రారెడ్డి తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కోడిపందేల స్థావరంపై దాడి


యలమంచిలి మండలం బాడవలో పోలీసుల అదుపులో కోడిపందాలరాయుళ్లు

యలమంచిలి: బాడవ గ్రామంలో గోదావరి ఒడ్డున కొబ్బరితోటలో కోడి పందేలు వేస్తున్నారనే పక్కా సమాచారంపై పాలకొల్లు రూరల్ సీఐ కుడుపూడి సతీష్ ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు దాడి చేశారు. పోలీసులను చూసి పరుగెత్తిన పందెంరాయుళ్ల తొమ్మిది మందిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.8100 నగదు, మూడు మోటార్ సైకిళ్లు, ఆరు కోళ్లు, రెండు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ఎస్సై కాకి శివనారాయణతోపాటు రూరల్ సర్కిల్, యలమంచిలి పోలీసులు పాల్గొన్నారు.

వీరవాసరంలో..

వీరవాసరం: మండలంలోని మడుగు పోలవరం లంక గ్రామం , ఓదులమ్మ పుంత సమీపంలో కోడిపందాలు ఆడుతున్నారనే సమాచారంతో మంగళవారం భీమవరం రూరల్ సీఐ వై. సత్య కిషోర్, వీరవాసరం ఎస్ఐ పి . రమేష్, సిబ్బంది ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. కోడిపందేలు ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1520 ల నగదు, ఏడు ద్విచక్రవాహనాలు, రెండు కోళ్ల పుంజులు, రెండు కోడి కత్తులు, మూడు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

ఉమాబాలకు అభినందనలు


ఉమాబాలను కలిసి సంఘీభావం తెలుపుతున్న ఉండి నియోజకర్గం నాయకులు

భీమవరం: వైఎస్సార్‌సీపీ నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ గూడూరి ఉమాబాలను ఉండి నియోజకవర్గానికి చెందిన పలువురు మర్యాదపూర్వకంగా కలసి సంఘీభావం తెలిపారు. మంగళవారం ఉమాబాల క్యాంపు కార్యాలయం వద్ద రాష్ట్ర వైస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ అధికార ప్రతినిధి,కాళ్ల మండలం కోఆప్షన్ సభ్యుడు గుర్రం జార్జ్ బెన్హర్, ఉండి నియోజకవర్గ క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు బి జార్జ్‌రాజు, జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ జనరల్ సెక్రటరీ ఎం రత్నకుమారి, కాళ్ల మండలం క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు సుందర్ జకారం, జిల్లా మహిళావింగ్ జాయిట్ సెక్రటరీ ప్రమీల జార్, ఆకివీడు మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షురాలు, ఐ భీమవరం గ్రామ సర్పంచ్ గాలి సామ్రాజ్యం తదితరులు ఉమాబాలను కలసిన వారిలో ఉన్నారు. అలాగే భీమవరం పట్టణం 23వ వార్డులోని చినపేట సచివాలయం ఇన్‌చార్జ్ చిగురుపాటి రాజు, కన్వీనర్లు బాలం శ్రీనివాస్, కూసిరెడ్డి బాలాజీ, గుమ్మడి రాధికా, విజయ్ డేనియల్ తదితరులు ఉమాబాలను కలసి పుష్పగుచ్ఛం అందించి సంఘీభావం తెలిపారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి కల్యాణం


ప్రత్యేకాలంకరణలో సత్యనారాయణ స్వామి

వీరవాసరం: మండలంలోని నౌడూరు జంక్షన్‌లో సత్యనారాయణ స్వామి కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.